# "అభిమానాలు"

కారుమేఘాలు గుంపులు అక్కడక్కడ విచ్చి తెల్లబడుతున్నాయి. దెప్పేవాళ్ళకి దెప్పసందు! ఎవడో రిటైరయిన తండ్రి పాతాళం వరకూ దించుకుపోయిన హృదయంతో, పద్నాలుగువందలు తెస్తున్నా తనను అక్కరచేయని కొడుకుని తల్చుకుని ఏడ్చినట్లుగా భోరున వాన! అప్పుడే కురిసి వెలిసింది.

తలకాస్త త్రిప్పితే, అరుగులమీద కూర్చుని కాగితపు పడవల్ని కట్టి నీళ్ళలో జారవిడుస్తున్న పిల్లలు, పురివిప్పుకున్న నెమళ్ళలా ఉత్సాహంతో వాళ్ళు వేసేగంతులు, ఆ బురదలో నీళ్ళతో ఆడుకోవటాలు అన్నీ చక్కగా కనబడుతున్నై.

చిన్న చిన్న ప్రవాహాలుగా రోడ్డుమీదినీరు పల్లానికి వాగుల్లోకి జీవితంలోని దుఃఖం కన్నీరు హృదయంలోని గతుకులులోతుల్లోకి ఇవన్నీ చూస్తూ అడుగులు వేస్తున్నారు పంతులుగారు. ఒక అడుగు వెనక్కు వేస్తేగాని ఆవేసే అడుగు జాగ్రత్తగా వేస్తేగాని ముందడుగు పడ్డంలేదు. ఆయన చేతిలో విప్పిపట్టుకున్న గొడుగు, దానికి ఆచ్ఛాదనంగా జాగ్రత్తగా కుట్టించిన తెల్లటిగుడ్డా అవి రెండూ పూర్తిగా తడిసాయి ఆ గొడుగు కావాకు ఒక చెవి తెగిన టైరు చెప్పుల జోడు వ్రేళ్ళాడుతోంది. ఆయన పంచె-అది పైకి ఎగగట్టి ఉంది. ఆ నీళ్ళలోపడ్తున్న అడుగులు-నడకలో ఆయనకు తన బ్రతుకు అందుకోసం పడ్డ-పడ్తూన్న కష్టాలు, కుటుంబం-పిల్లలూ అన్నీ మరోమారు జ్ఞప్తికొచ్చాయి.

ముప్పయేళ్లు సుమారుగా ఆయన యన్.జీ.వో. రిటైరయి ఇంచుమించుగా రెండ్నెల్లు కావస్తోంది. పింఛను కాగితాలు ఇంకా మంజూరయి రాలేదు. రావటంకోసం యెదురుచూస్తున్నారు. ఏదో పడవలాగెయ్యాలిగా-అందాకా మరోచోట నలభై రూపాయల నవుకరీ కుదిరింది. స్థిరాస్తి విషయంలో ఏ జాగ్రత్తలు చేసుకోలేకపోవటానికి ఎల్ల కాలమూ కుటుంబ విషయికమైన ఇబ్బందులు చాలీచాలని జీతమే కారణం. పై సంపాదన ఎరగడు.

ఆయన భార్యకు పదికుంచాలపొలం పసుపుకుంకుమ క్రింద ఉండేది. అది అమ్మి ఆయన ఓ చిన్న నివేశనస్థలం కొన్నారు. ఆ స్థలం ఆయన కొడుక్కి "బీకామానర్స్" చెప్పించడంకోసం తాకట్టు పెట్టారు. తరువాత ఆ కొడుకుమీది కోపం కొద్దీ చేతులారా ఆయన దాన్ని అమ్మేశారు. ఇప్పుడో మూడువేలు అప్పుంది. అందులో రెండువేలు కూతురుపెళ్ళి కయింది. ఒకవెయ్యి ఊళ్లో చెంబులు కంచాలు గిన్నెలు తాకట్టుపెట్టగా తెచ్చింది. ఇంట్లో రోజూ కుండలు డింకీలు కొద్తున్నాయి. ఇంకా ఒక కూతురుకి పెళ్ళి చెయ్యాలి. మూడోకొడుకు ఐదోఫారం. లెక్కలు బాగా చేస్తాడు. అన్నిట్లో వాడికి మంచి మార్కులు. ఇటీవల వాడు "మనుచరిత్ర" లో పద్యాలు వల్లెవేస్తూంటే "సప్తమస్కంధం" చదువుకోరాదా అని తనే కోప్పడ్డాడు. రెండోకొడుకు ఇంటరు పూర్తి చెయ్యలేదు. అది చేస్తాడనే నమ్మకమూ ఆయనకు లేదు. ఎవర్నన్నా మా వాడికి ఉద్యోగం యివ్వమని అడుగుదామంటే, దరఖాస్తు ఫారం కూడా ఆయనే వ్రాసి వాడ్నివెతికి చెయ్యిపుచ్చుకుని ఆఫీసుకు తీసుకెళ్లాలి. తానుగా కదిలి నాకు ఉద్యోగం కావాలని బయల్దేరడు. ఇంట్లో రెండుమాట్లు కాఫీ త్రాగుతాడు. ఇంట్లోవున్న కాస్సేపూ "మార్క్స్-ఏంజిల్సు, పీపిల్సు చైనా-స్టాలిన్" అంటాడు. ఇట్లా పైకనేకంటే ఊరిఖే ఇంట్లోకూర్చున్నా బావుండ్ను అని పంతులుగారు లోపల అనుకుంటారు. తప్పితే రోడ్లమీద-సిగరెట్లకు సాదరుకు అణానుంచి రూపాయి వరకూ తల్లిమీద జబర్దస్తీ చేసి లాక్కుపోగల్డు. వాడంటే ఆవిడకు ముద్దు. వాళ్ళనాన్నపేరు పెట్టుకుంది. అనుకున్నట్లు గానే వాడు ఓ చుట్టాలమ్మాయికోసం సరదాపడ్డాడు. చదువూ లేదు, ఆస్తీలేదు అన్నారు వాళ్ళ వాళ్ళు. హృదయం చూసి ఇవ్వమన్నాడు తను. "మార్క్స్-ఏంజిల్సు" వచ్చారు అడ్డు. ఆ పెళ్ళి కాలేదు. రాజారావు తల్లిని కొడుకు నేమీ అనకపోవటానికి ఇదోకారణం.

పొట్లకాయలు వంకరలు తిరిగినట్లు ఈ పిల్లలు ఉండుండి ఎందుకు అకస్మాత్తుగా ఇట్లా వంకర తిరిగిపోతారో పంతులు గారికి అర్థంకాలేదు.

విరక్తిచేసుగున్న ముకుందరావు చిన్నతనం ఆయనకు స్ఫురణ కొచ్చింది. తనకు యిరువై రెండేళ్ళప్పుడు ఆవిడకు పదిహేడేళ్లు. అప్పుడు పుట్టిన కొడుకు వీడు. అంటే సుశీ..... ఆఖరుది. దానికిప్పుడు పదేళ్లు. ఉద్యోగంలో చేరిన సంవత్సరమే కొడుకు. వాడికిప్పుడు ముప్ఫైయేళ్ళకు లోపు. ఎంత ముద్దుగా పెరిగాడని? తను మొక్కలకు బోదెలు త్రవ్వుతూంటే పాదులు పెడ్తూంటే కూడా గుప్పెళ్లతోమన్నుతీసి కుప్పలు పెట్టేవాడు. చెంబుతో నీళ్ళు తెచ్చి పోసేవాడు. బజారుకు వెనకాతలే వచ్చేవాడు. క్యాంపులకు వెళ్ళట మంటే వాడ్ని మరిపించడానికి బ్రహ్మాండమైన యత్నాలు చేయాల్సొచ్చేది. ఒకమాటు తను రైలుకు వెళ్తూంటే, ఎట్లా విడిపించుకుని తల్లినేమర్చి వచ్చాడో, ఆ రావటం తిన్నగా పోయిపోయి మాదిగ గూడెంలో పిల్లల్తోచేరాడు. అబ్బాయిగారు కనబట్టంలేదని కబురు-ఆ వేళ తనకెంత

కంగారు? కాళ్ళల్లోంచి ఒణుకు-గుండెల్లోంచిదడ! ఆ రాత్రి తనూ ఆమే యిల్లిల్లూ అడుక్కుంటూ ఏడుస్తూ వూరంతా గాలించేసారేం? ఆ మూడేళ్ల కుర్రకుంక...మర్నాటికిగాని పట్టుపడలేదు. ఎట్లాటి దుఃఖం? అట్లాటిదిప్పుడా కొడుకు...ఏతల్లి యేవేళ కాలుపెడ్తుందో...

నిరుటి వేసంకాలం ఆయనకు పట్టరాని కోపం వచ్చింది. ఇంట్లోని లొడ్డూలొసుగూ అమ్మేస్తానన్నారు. విదేశంలో పధ్నాలుగువందలు తెచ్చే కొడుకు హిందూదేశంలో "విశాఖపట్నం" ఎక్కడుందో మర్చిపోవాలా? ఒక అందమైన పద్దెనిమిదేళ్ళ పడుచు మాటలు, పధ్నాలుగువందలు తెచ్చి పడేస్తుంటే చూపే తీపి-(ఇదంతా వీడి ప్రయోజకత్వమేనా ఏవిటి? ఆ మహానుభావులు విదేశీ కార్యాలయంలోని వాళ్ళకు హూదాకోసం అంతలేసి జీతాలిస్తున్నారు గనుక) పదిరూపాయలు పంపిస్తే.... అదల్లాగుంచండి. ఒక ఉత్తరం ముక్క గిలికిపారేస్తే....సంతోషించే ముసలి దంపతులు-అపాటి చెయ్యలేదా? నిరుడు యింట్లో దొంగలుపడ్డప్పుడు బట్టల పెట్టెల దగ్గర్నుంచి నీళ్ళకాగు ఇత్తడిచెంబు వరకూ దోచుకుపోయినప్పుడు, ఎవరిదగ్గరకెళ్ళినా ప్రతివాళ్లూ ఏమన్నారు? బీకామానర్స్ దాకా చదువు చెప్పించారు. అందమైన అమ్మాయినిచ్చి పెళ్ళికూడా చేశారు. ఇంతకన్నా మహోపకారం ఏముంది తిరగబడ్డాని కని. పోనీ తిరగబడినా అది ఓమోస్తరు. చడీచప్పుడు గాకుండా శిలైపోయాడు. ఒక ఉత్తరం ముక్క వ్రాయడు. ఉన్నారో చచ్చారో అడగడు. ఎప్పుడన్నా మావగారి తాలూకు మనుష్యులు వచ్చి చెప్పేమాటలు విని సంగతులు గ్రహించుకోవాల్సిందే. ఏదో డబ్బుకూడా జాగ్రత్త చేసి మావగారికే పంపిస్తూన్నట్లు-ఆయనే నిరవాకం చేస్తున్నట్లు...మళ్ళీ ఈ ముక్క తను భార్యదగ్గర అనలేదు. అనకపోతేనే ఆవిడ-అంటే మరీ కుమిలి పోతుంది. ఇందాక వానకుముందు పోస్టుమాన్ ఇచ్చిన కార్డు ఇంకా ప్రక్కజేబులోనే వుంది. ముకుందరావు మావగారికి తమమీద దయో-మరిహేళనో-విదేశం నుంచి సంక్రాంతికి అల్లుడూ కూతురు బయల్దేరి వస్తూన్నట్లు కేబుల్ వచ్చిందని వ్రాసారు. ఈ సంతోషవార్త కన్నతల్లి చెవిని పడితే-ఆవిడ ముఖమంతా కాళిమ చేసుగుంటుంది. అన్నం మానేస్తుంది. మానేసి తిడ్తుంది కోడల్ని. పిచ్చెక్కినదానిలా దుర్భాషలాడ్తుంది. రెండు పిడికిళ్లూ బిగించి పటా పటా కొరుకుతుంది పళ్లు. 'నువ్వు కనలేదనుకోవే' -అంటాడు. తను మరీ దీనంగా ఏడుస్తుంది. ఈ ఒక్క విషయానికే పంతులుగారు కాస్త ఝుడిసారు. జడుస్తూ ఆయన మెట్లు ఎక్కబోతున్నారు. ప్రక్కింటివారి మనవడు తమ గుమ్మం ముందు కాలువలో వదిలిన కాగితపు పడవలోకి నీళ్ళు వెళ్తూంటే చిన్నబుచ్చుగుంటున్నాడు. వాడి పసిహృదయం ఎంతో రెపరెపలాడుతున్నట్లుగా ఉంది. డ్రాయింగు పుస్తకంలోని టావుల్ని చించి చేసిన క్రొత్తపడవను చేత్తో పుచ్చుకుని-సుశీ-అరుగుమీంచి ఒక్క ఉరుకు ఉరికింది జలప్రవేశం చెయ్యటానికి.

ఆ పిల్లల కేసి చూస్తూ గొడుగుముడిచి గుమ్మం దాటుతూ గొణుక్కున్నారు పంతులుగారు. 'నేనే పధ్నాలుగు వందలు తెచ్చినవాడి కొడుకునై పుట్టివుంటే....''

రవీమని నెత్తిమీద ఎవరో మొత్తినట్లు కళ్ళు బైరులు గ్రమ్మాయి, "రాజారావు రాజారావు" అంటూ ఏడుస్తూ ఇల్లాలు చేతిలో టెలిగ్రాము ఉంచేసరికి. బరంపురంలో పోలీసులు రాజారావును అరెస్టు చేశారు.

"వీడు బరంపురం ఎందుకు వెళ్ళాలిసొచ్చింది?" పంతులు గారు చిరాగ్గా అన్నారు. ఆవిడ వినిపించుగునే స్థితిలో ఉన్నట్లు లేదు. పెద్దగా అల్లరి చేస్తోంది ఏడూస్తూ. "నోరు మూసుగో...మనపిల్లాడని చెప్పుగున్నా అప్రతిష్ట. యేం చేశాడో..." పోలీసు స్టేషనుకు పరుగెత్తి పంతులుగారు ట్రంకు టెలిఫోన్లో వివరాలు అడిగించారు. పోలీసు ఇనస్పెక్టరు పకపకానవ్వుతున్నాడు. పంతులుగారు ముఖం మాడ్చుగుని ఇంటికి వచ్చేసారు. "ఇదుగో-నువ్వు వాడి కోసం ఏడ్చావంటే పీక పిసుగుతాను. ఏంచేశాడో తెలుసా నీ సుపుత్రుడు-అల్ల వాళ్ళమ్మాయికి బరంపురంలో పెళ్ళవుతోందిట. వీడు ప్రేమించిన అమ్మాయి పెళ్ళికి వీడు సిద్ధమయాట్ట-నాబొంద! యిదెక్కడి జాడ్యమేం...మారువేషంలో తగులడి ఆ అమ్మాయిని చాకుతో హత్య చేయబోయాట్ట-ఎంత అప్రదిష్ట! పోలీసులు నీ పుత్రరత్నాన్ని బరంపురం జైల్లోవేశాగ్ు ఆ అమ్మాయిని వీడి కివ్వకపోతే ఆ అమ్మాయికి ఇహ ప్రపంచంలో జీవించటాఽఽఠ హక్కు ఉన్నట్లులేదు. ఇదేమిప్రేమ-వీడిశ్రాద్ధం-నాశ్రాద్ధమూనూ. సినీమాలకు డబ్బు లిచ్చి గారం చేసి కొడుకు నింతవాడ్ని చేశావ్. ఇహ మాట్లాడావంటే సముద్రంలోకి త్రోయిస్తాను." నోటికొచ్చినట్లల్లా తిట్టారు. ఆవిడకు తృప్తిగాలేదు. ఈ యుగంలో ప్రేమంతా ఇల్లానే ఉండాలిసింది అన్నట్లున్నాయి ఆవిడ సమర్థనలు. పెళ్ళాం చెప్పినట్లు విని తల్లితండ్రులకు దూరమయిన ముకుందరావు ముందు ప్రేమించిన అమ్మాయికోసం జైల్లోపడ్డ రాజారావు "హీరో" లా కనిపించసాగాడు.

మర్నాడు ఉదయం భళ్లున ఎండకాసింది. వాల్తేరు స్టేషన్లో ట్రంకుపెట్టి మీద విశ్రాంతిగా కూర్చున్న పండుముత్తైదువ బరంపురానికి టిక్కట్టు కొనుక్కుని కలకత్తా మైలు కోసం ఎదురు తెన్నులు కాస్తున్నప్పుడు ఈ యుగంలోని భగ్న ప్రేమికుల సంఘానికి ఎన్నుకోని ప్రతినిధిగా పోలీసుల చేతుల్లో 'రాజారావు'ను తల్చుకుని తృప్తి పడసాగింది.

పంతులుగారు ఆ ఇల్లాలి మూర్ఖతను ఛేదించేందుకు ఆఖరుసారి విసరిన బాణంలా 'అన్నట్లు అబ్బాయి-విదేశం నుండి వస్తున్నాడు. కార్డు వచ్చిందేవ్! మరినువ్వు...'

"వాడిమాట చెప్పకండి-నాక....స...హ్యం...." ఆవిడ ముఖమంతా అదోలా పెట్టింది. ఈ ఒక్క ఆయుధం కూడా పనిచెయ్యకుండా పోయేసరికి పంతులుగారు ఆవిడను కూడా తన అప్తులలిస్టులోంచి కొట్టేసుకుని తన్ను కష్టపెట్టేవాళ్ళ జాబితాలో చేర్చేసుకున్నారు.

ముకుందరావు శిలాహృదయం-

రాజారావు భగ్నప్రేమ-

ఆ తల్లి మమకారం-ఈతీగలన్నింటినీ తప్పించుగుంటూ ఒంటరిగా తను మిగిలిపోయాననే ఆవేదనలో ఆయన తిరుగుముఖం పట్టేసరికి-

'సుశీ' వీధిలో చెట్టుకుకట్టిన ఉయ్యాలమీద ఆకాశమంతెత్తు ఊగుతోంది నిలబడి. కాళ్ళు జారి పడిపోదుకదా... దాని పావడా కుచ్చెళ్లు గాలి పోసుగుని మీదనుంచి దిగుతున్న 'పారాచూట్‌కన్య' లాగుంది చూడ్డానికి. మూడో కొడుకు గదిలో ఆల్‌జీబ్రాలెక్కలు చేసుగుంటూపోతున్నాడు. పంతులు గారు ధోవతీ పైకెగ్గట్టి వంటయింట్లో ఇంత కిరసనాయలు పొయ్యిలో పోసి కట్టెలముందు కూర్చుని గొట్టం మూతికి తగుల్చుకొని గాలి వూదుతున్నారు. బూడిదరేగి ముఖమంతా కొట్టుకుపోయింది. బుజాలు వీపు వెనుకభాగమంతా చెమటతో తడిసిపోయి నీరు కారుతోంది. వంట ఇంకా ఆరంభంలోనే వుంది. చుట్టూమాత్రం పొగ.

ఇంతలో వీధిలో బండి ఆగిన చప్పుడయింది యింటి ముందు. హృదయద్వారం వద్ద నిలబడి ఎవరో వచ్చి తలుపులు తెరవమని తడ్తున్నారు.

సుశీ బిగ్గరగా "అన్నయ్యా" అంటూ తప్పట్లుతరుస్తోంది. పంతులుగారు సంతోషపారవశ్యంతో ఒక్కమాటు తబిబనిలబడాలనుకుని ఆ ఆనందానికి తట్టుకోలేక పొయ్యి ముందు కుప్పలా కూలబడిపోయారు.